## 2. పరోపకారి పరాంకుశం

"ఎక్కడి దాకా?"

కిటికీ పక్కన కూర్చున్నానేమో; ఎవరెవరు ఆ కంపార్టుమెంట్లో ఎక్కుతున్నారో, ఎవరెవరు దిగుతున్నారో పట్టించుకోడం లేదు. కాని, మోచేత్తో పొడిచి మొహమాటం లేకుండా అడిగిన ఆ మనిషిని పట్టించుకోకుండా ఎలాగ!

"నువ్వా, పరాంకుశం!" అన్నాను.

"ఆఁ; నేనే! గుర్తు పడతావో, లేదో అని టెస్ట్ చేశాను!" అన్నాడు పరాంకుశం.

"ఎక్కడిదాకా? హైదరాబాదేనా?" అని అడిగాను.

"ఇది బావుంది. ముందు అడిగింది నేను!" అన్నాడు నవ్వుతూ.

"హైదరాబాదుకనే టిక్కెట్టు కొనుక్కున్నాను. ఈ బెర్తు నాకు రిజర్వైంది కూడాను.కాని అర్ధరాత్రి అపరాత్రీ అని వెనకాడకుండా బెజవాడలో దిగిపోవలసొస్తోంది. నువ్వుగాని హైదరాబాదుకి టిక్కెట్ కొనుక్కుని బెర్తు రిజర్వేషన్ చేయించుకోకపోతే నా టిక్కెట్ మీద నువ్వు హైదరాబాదు వెళ్ళిపోవచ్చు. నీ టిక్కెట్ నేను తీసుకుని రాత్రి బెజవాడలో దిగిపోయి బ్రేక్ జర్నీ రాయించుకుని రేపు ప్రయాణం కొనసాగించగలను."

"థాంక్యూ! నన్ను గుర్తుపెట్టుకోడమే కాకుండా, నాకు అడక్కుండానే ఒక ఉపకారం చేయడానికి సిద్ధపడ్డావు!"

"ఇందులో ఉపకారం ఏమీ లేదు. ఈ కంపార్టుమెంట్లో రాజమండ్రికి కోటా లేదని నాకు తెలుసు. నువ్విక్కడ ఎక్కావు గనక టికెట్ ఇన్స్పెక్టర్ని మంచి చేసుకుని ప్రయాణం చెయ్యవలసిందే. నా పరిస్థితులవల్ల నేను బెజవాడలో దిగిపోవడం తప్పనిసరైంది కనక నీకు నా టిక్కెట్ ఇచ్చేసి, కనీసం నువ్వయినా ఇబ్బంది పడకుండా ప్రయాణం చేసేట్టు చూడగల్ను. బెజవాడలో దిగిపోతున్నందుకు నాకు దండుగౌతున్న బెర్త్ ఛార్జీ పాతికరూపాయలూ ఎలాగూ నువ్విచ్చేస్తావు.'

పరాంకుశం నవ్వేడు. అందులో సుఖంగా ప్రయాణం చేస్తున్నందుకు తృప్తే ఉందో, నేనలా నిర్మొహమాటంగా చెప్పేసినందుకు హేళన ఉందో నాకు తెలియలేదు.

"ఇంతకీ నువ్వు బెజవాడలో తప్పనిసరిగా దిగిపోవలసిన ఆ పరిస్థితేమిటో చెప్పావు కాదు."

చెప్పాను:

నేను విశాఖపట్నంలో పని చేస్తున్నది ఒక ప్రయివేట్ కంపెనీలో. హైదరాబాదులో మా అమ్మాయీ, అల్లుడూ; వాళ్ళు ఈ మధ్యనే కట్టుకున్న ఇంట్లో ఎల్లుండి గృహప్రవేశం

చేస్తారనీ, ఆ రోజున నేనక్కడ ఉండాలనీ పదిరోజుల కిందట ఉత్తరం వచ్చింది. వెంటనే నాలుగు రోజులకి సెలవు కాగితం రాసి గ్రాంటు చేయించుకుని, టిక్కెట్ రిజర్వేషన్ చేయించుకున్నాను. ఇవాళ ఈ రైలు కోసం స్టేషన్ కొస్తే ప్లాట్‌ఫారం మీద మా కంపెనీ మేనేజింగ్ డైరెక్టరుగారు నన్ను పలకరించారు. ఆయన ఏదో అర్జెంటు పనిమీద హైదరాబాదు వెళ్తున్నారట. రేపు ఫ్లయిట్‌లో వెళ్ళడానికి టైమ్ ఉందిట గాని, బెజవాడలో ఒక అర్జెంట్ లెటర్ ఇవ్వవలసింది ఉందిట. అందుచేత ఈ రాత్రికి బెజవాడలో దిగి, రేపు ఉదయం ఆ పని పూర్తి చేసుకుని రేపు ఫ్లయిట్‌లోనే హైదరాబాదు వెళ్తున్నారట. ఈ సమాచారం అంతా చెప్పి-"అవునూ; మీ వాళ్ళింట్లో గృహప్రవేశం ఎప్పుడూ?" అని అడిగారు.

"ఎల్లుండండి" అన్నాను.

"అయితే, నా బదులు మీరే బెజవాడలో ఈ రాత్రి దిగిపోయి ఈ లెటర్ అక్కడ రేపు ఇచ్చేసి, రేపు మరో ట్రెయిన్‌లో హైదరాబాదు వచ్చేగలరేమో చూడండి?" అన్నారాయన.

నేను కొంచెం తటపటాయిస్తూ ఉంటే, ఆయనే అన్నారు- "అలా అర్ధరాత్రిపూట దిగడం, రేపు ఈ కవరు ఇవ్వడానికి బెజవాడలో తిరగడం, మళ్లీ హైదరాబాదు రైలు పట్టుకోవడం - ఇవన్నీ మీకు శ్రమ అవుతాయని నాకు తెలుసు. అయితే; మీరు అలా శ్రమ పడడానికి సిద్ధం అయితే నాకు ఆ శ్రమంతా తగ్గించినందుకు, ముఖ్యంగా ఆ టైమంతా మిగిల్చినందుకు ప్రతిఫలంగా ఈ ట్రిప్పు మొత్తం అఫీషియల్ చేసేస్తాను."

అలాగ స్వామికార్యం, స్వకార్యం కలిసొస్తున్నాయి కదా అనీ, ఆర్థికమైన ఊరడింపుతో బాటు ఎమ్.డి.గారి అభిమానానికి పాత్రత కూడా లభిస్తోందనీ - బెజవాడలో దిగి ఆయన చెప్పిన పని చేయడానికి సిద్ధపడి ఆ కవరు పుచ్చుకున్నాను.

"నేను హైదరాబాదు వెళ్ళడం లేదు. బెజవాడలో దిగిపోతున్నాను. అందుచేత నీ టిక్కెట్ నా కవసరం లేదు" అన్నాడు పరాంకుశం.

"బెజవాడలో నువ్వు దిగిపోతున్నావా...? సరే, నువ్వు ఈ రాత్రికి ఎక్కడ దిగుతావు? అదే, ఏదైనా లాడ్జిలో రూం తీసుకుంటావా?" అని అడిగాను.

"నాకేం కర్మ? హాయిగా మా ఇంటికి పోతాను. అన్నట్టు నీకు చెప్పనే లేదు కదూ! నాకు బెజవాడ ట్రాన్స్‌ఫరై రెండేళ్ళయింది.

"సరి! చెప్పావే కాదు!" అన్నాను.

"న న్నేమైనా చెప్పనిస్తే కదా నువ్వసలు? వెధవది, ఒక కవరు పట్టుకెళ్ళి అదేదో ఆఫీసులో ఇచ్చే మెసింజరు పని నెత్తిమీద వేసుకుని బోలెడు కథ చెప్పావు."

"సారీ, పరాంకుశం! నా సంగతి నీకు తెలుసుగా, ఎవరికి ఏం చెప్పినా పూర్తిగా బోధపడాలన్న దృష్టితో అన్ని వివరాలతో సహా చెప్పడం నా కలవాటు. ఇంతకీ నేను బెజవాడలో దిగి-"

నా ఆలోచన మరేం లేదు. బెజవాడ చేరేసరికి రాత్రి పదకొండు దాటుతుంది. ఆ వేళప్పుడు గదులు ఖాళీగా ఉండే లాడ్జీలు దొరక్కపోవు గాని, రిక్షా ఎక్కి పేట పేటా చక్కబెడుతూ ఓ గంటయినా తిరగవలసి రావచ్చు. పరాంకుశం వెళ్ళేది సాక్షాత్తూ వాళ్ళ ఇంటికే గనక అతనితో బాటే వెళ్ళిపోయి వాళ్ళింట్లో ఏ వరండామీదనో కళ్ళు మూసుకుంటే ఇట్టే తెల్లారిపోతుంది. పొద్దుటే లేచి ఎనిమిది, తొమ్మిది గంటల మధ్య ఆ కవరు ఇవ్వాల్సినచోట ఇచ్చేస్తే పనైపోతుంది. నా అదృష్టం బావుండి కోణార్క ఒక గంట గాని లేటయిందా, రేపు సాయంకాలంలోగానే హైదరాబాదు చేరిపోగలను. ఈమాత్రం దానికి బెజవాడలో లాడ్జీలు వెతికి గది అద్దెకి తీసుకోవడం ఎందుకూ?

ఇదంతా కనిపెట్టేసిన వాడిలా-"ఆ కవరేదో నాకిచ్చెయ్యి! నీకు బదులు నేనే ఆ ఆఫీసులో ఇచ్చేస్తాను. ఈమాత్రం పని కోసం నువ్వు రిజర్వేషన్ పక్కాగా ఉన్న టిక్కెట్టు మీద బ్రేక్ జర్నీ రాయించుకుని రేపు మరో ట్రెయిన్ పట్టుకోడం ఎందుకు? నాకెలాగా పరోపకారి పరాంకుశం అని బిరుదు ఇచ్చావు కదా!" అన్నాడు పరాంకుశం.

పరాంకుశం చెప్పినట్లు చేస్తే అది స్వామి ద్రోహచర్య కిందకి వస్తుంది. కాని, ఇందులో నా స్వామి - అనగా మా మేనేజింగు డైరక్టర్‌గారు - నష్టపోయేది మాత్రం ఏముంది? ఆయన ధ్యేయమల్లా ఆ కవరు బెజవాడలో ఆ ఆఫీసుకి చేరడం. అంతే! పైగా పరాంకుశం బెజవాడలో స్థానికుడు. ఆ కవరు ఆ ఆఫీసులో ఇచ్చేయడం అతనికి కొంచెం కష్టమే అయినా, అది అతనికి నా అంత కష్టం కాదు. అదంతా అలా ఉంచి, వేళగాని వేళప్పుడు నన్ను తన ఇంటికి తీసుకెళ్ళడం, నాకోసం కొద్దో గొప్పో ఏర్పాట్లు చెయ్యడం- ఈ కష్టాలు అతనికి ఉండవు.

అందుచేత ఒకటికి రెండుసార్లు జాగ్రత్తలు చెప్పి ఆ కవరూ, ఆ ఆఫీసు వాళ్ళ సంతకం చేసి ఇవ్వవలసిన రసీదూ పరాంకుశానికి ఇచ్చేశాను.

❖ ❖ ❖

నాలుగు రోజుల సెలవూ అయిపోయి, నేను మా ఆఫీసులో అడుగు పెట్టగానే పరాంకుశం నాకు పోస్టులో పంపవలసిన రసీదు కోసం డిశ్పాచి గుమస్తా దగ్గర ఉన్న టపా అంతా వెతుకుతున్నాను. ఇంతట్లోకి - "ఎం.డి.గారు తమర్నోసారి రైచేయమన్నారు సార్!" అని కబురు...

ఛేంబర్సులో అడుగు పెట్టగానే - "ఏదీ, రసీదు?" అని నన్ను ఎం.డి. గారు రొకాయించడం ఖాయం. ఏమిటి చెప్పాలా అని ప్రాణం కడబట్టిపోయింది. తెల్లవారి లేవగానే కవరు పట్టుకెళ్ళి అక్కడ ఇచ్చేసి రసీదు సంతకం పెట్టించుకుని ఆ రసీదుని కవరులో పెట్టి నాకు పోస్టు చేశాక గాని ఇంటికి వెళ్ళనని పరాంకుశం నమ్మకంగా చెప్పాడు. "నా పేరే పరోపకారి పరాంకుశం కదా! దానికే ముప్పు తెచ్చుకుంటానా?" అన్నాడు. మరి టపాలో చూస్తే నాకు పరాంకుశం నుంచే కాదు. ఇంకెక్కణ్ణించీ కూడా ఒక కవరు మాట అటుంచి

కార్డు ముక్క కూడా లేదు. టిక్కెట్ డబ్బులు ముదరా వస్తాయి కదా అని కక్కుర్తి పడ్డందుకు ఘోరంగా దెబ్బతినేశానే అని వ్యథ పట్టుకుంది. పోనీ ఒక రోజు సెలవు పొడిగించి ఇంట్లోనైనా ఉండిపోయాను కాదు, అడ్డంగా దొరికిపోయాను!

చెడు జరుగుతుందని నిర్ధారణగా తెలిస్తే అవి వీలైనంత ఆలస్యంగా జరిగేటట్టు చూసుకోమని శాస్త్రం. అందుచేత కబురు రాగానే చంకలు గుద్దుకుంటూ ఆ ఏర్ కండిషన్డ్ ఛేంబర్స్‌లోకి దూరిపోకుండా కొంచెంసేపు కాంటీన్‌లోనూ, అంతకన్నా కొంచెం తక్కువసేపు టాయిలెట్‌లోనూ గడిపి, ఒక్క నిమిషం సీట్‌లో కూర్చుని మొహంమీద రుమాలు నడుపుకుంటున్నాను. అంతే, ఎం.డి.గారు జంయ్యిమని స్వయంగా ఛేంబర్సులోంచి ఇవతలి కొచ్చేశారు. ఆయన్ని చూసీ కూడా గాభరాలో అందర్లాగా లేచి నిలబడనైనా నిలబడకుండా అలా కుర్చీకి అతుక్కుపోయి కూచున్నాను - ఏమీ తోచని స్థితిలో.

ఎం.డి.గారు తిన్నగా నా టేబుల్ దగ్గిరి కొచ్చేశారు. ఓ చెయ్యి షేక్‌హేండ్ కోసం జాపి - "థాంక్యూ! రసీదు వచ్చేసింది. కాని, అక్కడిదాకా వెళ్ళిన వాడివి స్వయంగానే కవర్ ఇచ్చేయకుండా దాన్ని రిజిష్టర్ పోస్టు, అక్నాలెజ్‌మెంట్ డ్యూలో ఎందుకు పంపావో నాకు అర్థం కాలేదు. అఫ్‌కోర్స్, చేతి రసీదైతే డిశ్పాచి క్లర్కు ఇచ్చుండేవాడు. ఇది ఆఫీస్ మేనేజర్ సంతకంతో వచ్చింది. అదీ ఒకందుకు మంచిదే. ఎనీ వే, థ్యాంక్యూ! నేనైతే అంత సమర్థంగా చెయ్యలేకపోయుండేవాణ్ణి!" అని అంతా ఒక్క గుక్కలో చెప్పేసి బయటికి వెళ్ళిపోయారు.

గండం గడిచినా సస్పెన్సు విడకపోవడం వల్ల నా ఆందోళన తగ్గింది కాదు.

❖ ❖ ❖

సాయంకాలం ఇంటి కెళ్ళేసరికి అక్కడుంది ఒక కవరు, పరాంకుశం ఫ్రం ఎడ్రసుతో.

మూడు ముక్కల్లో చెప్పొచ్చు కదా - నువ్వప్పగించిన పని సక్రమంగా చేసేశానని! మూడు కాగితాలు రాశాడు.

❖ ❖ ❖

"మిత్రమా!"

ముందుగా "ఇచ్చేశాను ఆ కవరు" - అని చెప్పనీ. ఎందుకంటే అన్నిటికంటే ముందు ఆ కబురు నీకు అవసరం. లంకకి వెళ్ళి వచ్చిన ఆంజనేయస్వామి రాములవార్ని చేరగానే మొట్టమొదట - "చూశాను సీతాదేవమ్మగార్ని" - అన్నాడే గాని - "నమస్కారం సార్! బావున్నారా? తమరు ఆనతిచ్చిన విధంగా లంకకి వెళ్ళి సీతమ్మ వార్ని చూశాన్ సార్!" అన్లేదుట.

అయితే, ఆ కవరు నేను స్వయంగా పట్టికెళ్ళి ఇయ్యలేదు. అలాగని మరొకరి ద్వారా కూడా పంపలేదు. రిజిస్టర్డ్ పోస్టు, అక్నాలెడ్జ్‌మెంట్ డ్యూలో పంపాను. రసీదు డైరెక్టుగా మీ ఎం.డి.గారికి వస్తుంది. ఈపాటికి వచ్చేసుండొచ్చేమో కూడాను.

"ఎనిమిది రూపాయలెందుకు ఖర్చు పెట్టాలి. రానూ పోనూ రిక్షా బేరం ఆడుకుంటే మూడు రూపాయల్లో తెమిలిపోతుంది కదా అని నీకు అనిపించొచ్చు. దానికి కారణం ఉంది.

"నేను ఉదయం లేవగానే పేపరు చదవకుండా ఏ పనీ చెయ్యను; నీకు తెలుసు కదా! ఆ ఉదయం - అలాగా పేపర్ చూస్తుంటే - "గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో ఫస్టు క్లాసు ఏ.సీ. కంపార్టుమెంట్‌లో చోరీ" అనే వార్త కనబడింది. ఈ మధ్య మన సంస్కృతి ఎంతలాంటి పరిణామాలకి లోనైందో ఎవరూ చెప్పక్కర్లేదు. పేపర్ చేతికి రాగానే ముందు క్రయిమ్ పేజీ చూసేవాళ్ళు చాలామంది బయలుదేరారు - నాకులాగే.

"మీ ఎం.డి.గారు విశాఖపట్నం నుంచి ఫస్ట్ క్లాస్ ఏ.సి. టిక్కెట్ విజయవాడ వరకు తీసుకున్నారు. (చెప్పావు కదా, ఆయన ఇక్కడే దిగిపోదామని నిర్ణయించుకుని బండెక్కారని!) ఆ టికెట్ హైదరాబాద్ వరకు పొడిగించుకోడం, అందుకు అవసరమైన ఛార్జీ చెల్లించడం, రిజర్వేషన్ ఓ.కే. చేయించుకోడం - ఈ పనులు తగిలి ఆయన తన స్థలం వదిలి ప్లాట్‌ఫారం మీదికి వచ్చారట. తిరిగి అన్ని పనులూ చేయించుకుని లోపలికెళ్తే ఆయన బ్రీఫ్‌కేసు, దాన్ని కనిపెట్టుండమని అప్పగించిన మనిషి అక్కడ గైరు హాజరు!

"ఆయన పోలీసు రిపోర్టు ఇవ్వడం దగ్గర్నుంచి అన్నీ వివరంగా ప్రచురించారు న్యూస్‌పేపర్‌లో.

"నేను వెంటనే నువ్విచ్చిన కవరు ఒక సైడు నుంచి చాకచక్యంగా తెరిచాను. దాంట్లో పది లక్షల రూపాయల విలువ చేసే ఒకానొక వర్క్ కోసం టెండరు ఫారాల వెల నిమిత్తం రెండు వందల ఏభై రూపాయలకి ఒక బ్యాంకు డ్రాఫ్ట్ ఉంది. అది అందగానే ఆ టెండరు ఫారాలు ఆయనకి చేరుతాయి. అయితే, ఆయన ఇచ్చిన కవరు ఆ ఆఫీసులో నేనే స్వయంగా ఇవ్వడానికి ప్రయత్నిస్తే నన్ను ఎవరో ఒకరు గుర్తుపట్టడమే కాక, పోలీసులకి ఆ సమాచారం చేరవేసే అవకాశం కూడా ఉంది. బ్రీఫ్‌కేస్ నువ్వే దొంగతనం చేశావు. అందులో 'నగదూ, నట్రా' ఉంచేసుకుని క్రాస్ చేసిన డిమాండు డ్రాఫ్ట్‌ని ఏమీ చెయ్యలేక హాండోవరు చేశావు అని నన్ను బైండోవరు చేస్తారేమో? అసలు ముందుగా మక్కెలు విరగతన్ని మరీ మాట్లాడతారేమో! ఉపకారానికి పోయి అపకారం కొనితెచ్చుకోడం వీథిన పోయేది నీపుకి రాసుకోడం అవుతుందేమో అనిపించింది. నాకు ఆ కవరు ఒక మిత్రుడి ద్వారా చేరిందని నేను వాళ్ళకి నమ్మకం కలిగే విధంగా చెప్పేలోపలే నా శరీరం కొంత బాధపడడం జరగొచ్చు కదా.

"టెండరు ఫారాలు అడుగుతూ డ్రాఫ్టు పంపడానికి అప్పటికి ఇంకా ఒక రోజు వ్యవధి ఉంది. అంతేకాక, నేను ఆ డెలివరీ జోన్‌లో రిజిస్టర్ చేస్తే ఆ రోజు కాకపోయినా మర్నాడయినా అందిపోయే అవకాశం ఉంది. అందుకని వెంటనే కవరు మళ్ళా అంటించేసి

రిజిస్టరు పోస్టులో, ఎక్నాలెడ్జిమెంటు డ్యూతో వేశాను. రిజిస్టరు చేసినందుకు పోస్టాఫీసు వారిచ్చిన స్లిప్పు ఇందుతో జత పరచాను.

"మరీ చిన్నయసూరి లా బయలుదేరి నీతిచంద్రిక చెప్పడం మొదలెట్టాననుకోకపోతే ఒక సంఘటన చెప్తాను.

రాంమోహన్ అని నా క్లాస్‌మేటుండేవాడు. వాళ్ళ నాన్నగారికి హైదరాబాదులో ఒకానొక పోలీసు స్టేషన్ కెదురుగా ఒక కాఫీ హోటలు ఉండేది. ఓ రోజు సాయంకాలం నాలుగవుతూ ఉండగా ఒక పాసింజరు ఆ హోటల్లో కొచ్చి, ఆకుల్లో పొట్లాం కట్టి తాను తెచ్చుకున్న టిఫిన్ తిని, అక్కడ కాఫీ తాగి, అక్కడికక్కడే చచ్చిపోయాడు.

"క్షణాల మీద పోలీసులు రంగంలో దిగారు. ఎవరు చెప్పినా ఒకటే మాట; టిఫిన్ తిన్నాడు. కాఫీ తాగాడు, చచ్చిపోయాడు. అంతే!

"నీ హోటల్లో తిన్న పదార్థంలో విషం ఉంది. అందుకే వాడు చచ్చాడు!" అని డబాయించి రాంమోహన్ తండ్రిని అరెస్టు చేశారు.

"వాడు తిన్న టిఫిను మేం సర్వు చేసింది కాదు. ఆకు పొట్లాం విప్పుకుని వాడు తెచ్చుకున్నదే వాడు తిన్నాడు. మేం ఇచ్చింది మంచినీళ్ళూ, కాఫీ మాత్రమే!" అని ఎంత మొత్తుకున్నా ఎవరూ వినిపించుకోలేదు. ఒక అరగంట గడిచేలోగా జనం వెర్రెత్తిపోయి ఫర్నిచర్ అంతా ధ్వంసం చేసేశారు. ఆ తరువాత అక్కడ షెల్ఫుల్లో స్టాకులో ఉన్న స్వీట్లూ వగైరా టిఫిన్లూ, రుబ్బింగులో ఉన్న పిండి, డికాక్షన్లూ అన్నీ స్వాధీనం చేసుకున్నారు. ఆ పాత్రలతో, బేసిన్లతో సహా. ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు అవన్నీ కెమికల్ ఎనాలిసిస్ చేసి వాట్లో దేంట్లోనూ విషం లేదని సర్టిఫికేట్లయితే ఇచ్చారు. కేసేమో అతనికి శిక్ష లేకుండా ముగిసింది. కాని ఆ పాత్రలు, బేసిన్లు, కప్పులు, సాసర్లతో సహా ఏ ఒక్కటీ తిరిగి రాలేదు. పైగా 'ఫుడ్ ఇన్‌స్పెక్టర్లని మంచి చేసుకుని కేసు లేకుండా చూసుకున్నారే తప్పా, ఇక్కడ అంతా విషమే' అని అపవాదు వచ్చిపడి మళ్ళీ వాళ్ళు హోటల్ తెరవడానికి సావకాశం ఏర్పడలేదు. ముసలాయన బెంగతో, అవమానంతో మంచి పట్టి ఏడాది తిరక్కుండా కాలం చేశాడు. రాంమోహన్ అడ్రస్ లేదు! దరిమిలాను, హోటళ్ళన్నిట్లోనూ - "బయటినుండి తెచ్చిన పదార్థాలు ఇచ్చట ఆరగించరాదు" అని నోటీసులు పెట్టారు.

"కాలం కలిసి రాకపోతే తాడే పామై కరుస్తుందంటారు. అందుచేత 'పరోపకారి పరాంకుశం' అయినా సరే కొంతమేరకి జాగ్రత్తగా ఉండవలసిందే.

"మీ ఎం.డి. గారికి ఆ టెండరు ఇస్తే మాత్రం నా సంగతి మర్చిపోవద్దని చెప్పుమీ!'

*("ఆంధ్రప్రభ" వీక్లీ : 21-8-92)*